క్లుప్తంగా...

నిజాం కళాశాల హాస్టల్‌ను ప్రారంభించాలి

గన్‌ఫౌండ్రీ: నిజాం కళాశాల వసతి గృహాన్ని తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు శనివారం బషీర్‌బాగ్‌లో నిరసన వ్యక్తం చేశారు. మెస్ ఛార్జీలు చెల్లించి పది రోజులు గడుస్తున్నా వసతి గృహాలను ప్రారంభించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే వసతి గృహాన్ని ప్రారంభించాలని ప్రిన్సిపాల్‌ను కోరగా కనీసం స్పందించకపోవడం బాధాకరమన్నారు. విద్యార్థుల ఆందోళనకు మాజీ ఎంపీ వీహెచ్ హన్మంతరావు, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షులు రోహిన్‌రెడ్డి, మెట్టు సాయికుమార్ హాజరై సంఘీభావం ప్రకటించారు. విద్యాశాఖ మంత్రి, ఓయూ వీసీలతో వారు మాట్లాడగా 1వ తేదీన వసతి గృహాన్ని ప్రారంభిస్తామని తెలపడంతో విద్యార్థులు ఆందోళనను విరమించారు. ఈ రెండు రోజుల పాటు విద్యార్థులకు భోజన సౌకర్యాన్ని కల్పిస్తానని రోహిన్‌రెడ్డి తెలిపారు.

సత్కారం



ఏసీపీ మనోజ్ కుమార్‌ను కలిసిన ముప్పిడి సీతారాం రెడ్డి

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట ఏసీపీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మనోజ్ కుమార్‌ను శనివారం చాంద్రాయణగుట్ట నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి ముప్పిడి సీతారాం రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలుతెలిపారు. ఈ ఆయనతో పాటు లలితాబాగ్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు జమ్మిచెట్టు రాజు, చాంద్రాయణగుట్ట డివిజన్ జనరల్ సెక్రటరీ నరేశ్ కుమార్ తదితరులు ఉన్నారు.

అడిషనల్ డీసీపీగా కోటేశ్వర్‌రావు



అబిడ్స్: రెండేళ్లకు పైగా గోషామహల్ ట్రాఫిక్ ఏసీపీగా విధులు నిర్వహించిన బి.కోటేశ్వర్‌రావుకు అడిషనల్ డీసీపీగా పదోన్నతి లభించింది. నగరంలో కొన్ని సంవత్సరాలుగా ఎస్సైగా, ఇన్‌స్పెక్టర్‌గా, ఏసీపీగా పనిచేసిన కోటేశ్వర్‌రావుకు రాచకొండ పరిధిలోని ఎల్బీనగర్ జోన్ అడిషనల్ డీసీపీగా నియమిస్తూ డీజీపీ అంజనీకుమార్ ఆదేశాలు జారీ చేశారు. పదవీబాధ్యతలు స్వీకరించిన కోటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. స్థానిక ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకై ప్రత్యేక కృషి చేస్తానన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు పోలీస్ శాఖ అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు.

ముఖేష్‌గౌడ్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న బోనాల శ్రీనివాస్ తదితరులు

అఫ్జల్‌గంజ్: నిరంతర కృషితో కార్పొరేటర్ నుంచి రాష్ట్ర మంత్రిగా ఎదిగిన మహానాయకుడు ముఖేష్‌గౌడ్ అని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శనివారం ముఖేష్‌గౌడ్ 4వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు.

సంక్షేమ పథకాలతోనే బీఆర్ఎస్‌కు ఆదరణ



బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు

అబిడ్స్: సంక్షేమ పథకాలతోనే బీఆర్ఎస్‌కు తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ఆదరణ లభిస్తుందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై గోషామహల్ నియోజకవర్గంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలు బస్తీల కార్యకర్తలు, నాయకులు బీఆర్ఎస్ చేరుతున్నట్లు పేర్కొన్నారు. గోషామహల్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలు పార్టీల నాయకులకు, కార్యకర్తలకు నందకిశోర్ వ్యాస్ బిలాల్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బిలాల్ మాట్లాడుతూ.. పదేళ్లుగా బీజేపీ ఎమ్మెల్యే నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తే నియోజకవర్గం నలుమూలలా పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పింతుసింగ్, ధర్మేందర్ సింగ్, గణేష్, విఘ్నేష్, శివసింగ్, వివేక్ సింగ్, వినాయక్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



ఏనుగు అంబారీపై ఆలం ఊరేగింపు



ఆలంకు దట్టీలు సమర్పిస్తున్న అంజన్ కుమార్‌యాదవ్, గాజుల అంజయ్య, అనిల్ కుమార్



గోల్కొండ అషుర్‌ఖానాలో గోల్కొండ ఎస్సై వెంకటేష్ తదితరులు

త్యాగానికి ప్రతీక మొహర్రం

- భక్తిశ్రద్ధలతో మొహర్రం
- కులమతాలకు అతీతంగా మొక్కులు తీర్చుకున్న భక్తులు
- పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున షర్బత్ పంపిణీ

డబీర్‌పురా: మొహర్రం సంతాప దినాలను పురస్కరించుకొని శనివారం పదో మొహర్రం సందర్భంగా పాతబస్తీ వీధుల్లో నిర్వహించిన బీబీకా ఆలం భారీ ఊరేగింపు ప్రశాంతంగా కొనసాగింది. షియా ముస్లిం యువకులు నల్లటి దుస్తులు ధరించి సంతాప సూచికంగా నిర్వహించిన మాతంతో విషాద ఛాయలు అలుముకున్నాయి. హజ్రత్ ఇమామ్ హుస్సేన్‌ను స్మరించుకుంటూ చిన్నారులు, యువకులు, వయోవృద్ధులు తదితరులు చేతులకు బ్లేడ్‌లు, కత్తులను అమర్చుకొని ఎదపై బాదుకుంటూ రక్తాన్ని చిందించారు. దారి పొడవున ఏర్పాటు చేసిన స్వాగత వేదికలపై నుంచి పలువురు అధికార, అనధికార ప్రముఖులు, రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు అంబారీపై వచ్చిన బీబీకా ఆలంకు పూలు, దట్టీలు సమర్పించారు. డబీర్‌పురా బీబీకా అలావా నుంచి ప్రారంభమైన ఈ భారీ ఊరేగింపు షేక్‌ఫైజ్ కమాన్, యాకుత్‌పురా దర్వాజా, ఎతేబార్‌చౌక్, కోట్లాఆలిజా, చార్మినార్, గుల్జార్‌హౌజ్, పంజేషా, కద్మే రసూల్, ఎతేబార్ చౌక్, మీరాలంమండి, పురానీహవేలి, దారుషిఫా, మసీదే ఇమామియా, మసీదే ఇలాహిల మీదుగా చాదర్‌ఘట్ వరకు కొనసాగింది.



మాట్లాడుతున్న మౌలానా సయ్యద్ మతీన్ అలీషాఖాద్రి

ఆలంల ఊరేగింపునకు భారీ బందోబస్తు..

పదో మొహర్రం సందర్భంగా శనివారం నిర్వహించిన బీబీకా ఆలం ఊరేగింపు సందర్భంగా పాతబస్తీలో దక్షిణ మండలం పోలీసులు భారీ బందోబస్తును నిర్వహించారు. చార్మినార్ వద్ద ఏర్పాటు చేసిన స్వాగత వేదికపై నుంచి నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్‌తో పాటు నగర అదనపు పోలీసు కమిషనర్ (లా అండ్ ఆర్డర్) విక్రమ్ సింగ్ మాన్, నగర ట్రాఫిక్ అడిషనల్ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు, ఎస్‌బీ అడిషనల్ పోలీసు కమిషనర్ పి.విశ్వ ప్రసాద్, దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య తదితరులు బీబీకా ఆలంకు స్వాగతం పలికి పూలు, దట్టీలు సమర్పించారు.

ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయి..

చార్మినార్: పాతబస్తీలో ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ అన్నారు. మొహర్రం సంతాప దినాలను పురస్కరించుకొని శనివారం పాతబస్తీ ప్రధాన వీధుల్లో బీబీకా ఆలం సామూహిక ఊరేగింపు జరిగింది. మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో మీరాలంమండి వద్ద ఏర్పాటు చేసిన స్వాగత వేదికపై నుంచి ఆయన స్వాగతం పలికారు.

జయహో భారతీయం ఆధ్వర్యంలో..

మొహర్రం సంతాపదినాల సందర్భంగా శనివారం పాతబస్తీలో నిర్వహించిన బీబీకా ఆలం సామూహిక ఊరేగింపునకు మీరాలంమండి వద్ద జయహో భారతీయం అధ్యక్షుడు హనుమంతరావు స్వాగతం పలికి ఆలంకు పూలు, దట్టీలు సమర్పించారు.

గోల్కొండలో..

గోల్కొండ: త్యాగానికి, ధర్మ మార్గానికి ప్రతీక మొహర్రం అని ఆల్ ఇండియా ఖీరత్ కమిటీ అధ్యక్షుడు మౌలానా సయ్యద్ మతీన్ అలీషాఖాద్రి అన్నారు. శనివారం గోల్కొండ అస్కరీ మసీదులో యౌమే ఆషురా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పవిత్ర మొహర్రం, హజ్రత్ ఇమామ్ హుస్సేన్ త్యాగంపై మాట్లాడారు. నేటి యువత ప్రవక్త మహ్మద్ బోధనలను పాటిస్తూ ఇమామ్ హుస్సేన్ త్యాగ నిరతిని పాటించేవాడని ఆయన అన్నారు. హైకోర్టు న్యాయవాది ఎంఏ ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

దట్టీల సమర్పణ..

అహ్మద్‌నగర్, గోల్కండ, టోలిచౌకి తదితర ప్రాంతాలలోని ఆషుర్‌ఖానాలలో ఆలంలను ముస్లింలు దర్శించుకుని దట్టీలు సమర్పించారు. గోల్కొండ ఎస్సై వెంకటేష్ రిసాలబజార్‌లోని మోతీ దర్వాజ ప్రాంతాలలోని అషుర్‌ఖానాలను సందర్శించారు. గోల్కొండ రిసాలబజార్‌లో సాయిబాబాచారి ఆధ్వర్యంలో షర్బత్ పంపిణీ జరిగింది. టోలిచౌకి లేబర్ అడ్డా, మెహిదీపట్నం పాత సర్వీ హోటల్, అహ్మద్ నగర్ బడాబజార్ తదితర ప్రాంతాల్లో స్థానిక యువజన సంఘాల వారు షర్బత్ వితరణ నిర్వహించారు.



ఊరేగింపులో పాల్గొన్న షియా ముస్లింలు

రోట్, షర్బత్ వితరణ..

కర్బలా యుద్ధం ధర్మపరిరక్షణ, న్యాయం కోసం జరిగిన పోరాటమని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సిలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. శనివారం టోలిచౌకిలోని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సిలింగ్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో మొహర్రం ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన దమ్‌కే రోట్, షర్బత్ వితరణ చేశారు.

షర్బత్ పంపిణీ...

విజయనగర్‌కాలనీ: మొహర్రంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాంప్రదాయ దుస్తులతో స్థానిక మసీద్‌లకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆసిఫ్‌నగర్, జిబాబాగ్, మురాద్‌నగర్, మాసబ్‌ట్యాంక్ తదితర ప్రాంతాల్లో ముస్లింలు షర్బత్ పంపిణీ నిర్వహించారు. ఆసిఫ్‌నగర్ శంకర్‌నగర్ రాయల్ సి హోటల్ వద్ద రాయల్ వాల్కనైజింగ్ ఆధ్వర్యంలో స్థానికులతో పాటు రోడ్డుపై వెళ్లే వాహనదారులకు షర్బత్ అందజేశారు.

గోషామహల్ నియోజకవర్గంలో..

అబిడ్స్: మొహరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. గోషామహల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన వేడుకల్లో నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకురాలు శాంతిదేవి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల పండగలకు పూర్తిగా సహకారం అందిస్తుందన్నారు. ఆసిఫ్, రజాఅలీ, ప్రేమ్‌అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.



గోల్కొండ అషుర్‌ఖానాలో..



వేడుకల్లో గోషామహల్ బీఆర్ఎస్ నాయకురాలు శాంతిదేవి



గోల్కొండ రిసాలబజార్‌లో షర్బత్ పంపిణీ



రాయల్ సి హోటల్ వద్ద షర్బత్ పంపిణీ

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతున్నాని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన టోలిచౌకి, నానల్‌నగర్ డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా ప్రాంతాల్లో వర్షం వల్ల తలెత్తిన సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు స్థానిక సమస్యలను వివరించారు. డ్రైనేజీల మరమ్మతుల కోసం ఎవరూ కూడా ఇప్పటి వరకు తమ బస్తీకి రాలేదని పలువురు ఆయనకు తెలిపారు. పారిశుద్ధ్య పనులు కూడా అస్తవ్యస్తంగా తయారయ్యాయని వారన్నారు. పారిశుద్ధ్య పనుల కోసం ప్రస్తుతం ఉన్న యూనిట్లకు తోడుగా అదనపు యూనిట్లను కూడా నియమించామని ఎమ్మెల్యే వారితో అన్నారు. ప్రతి బస్తీలో పర్యటించి ముందుగా డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని, అధికారులను ఆదేశించామని తెలిపారు. ఆయన వెంట కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు అలీమొద్దీన్ తదితరులున్నారు.



సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కౌసర్

గోషామహల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కృషి

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ నియోజకవర్గంలోని జగ్జీవన్‌రామ్ బస్తీ ప్రజలతో మంత్రి తలసానిని కలిశారు. బస్తీలో ఉన్న సమస్యలు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జగ్జీవన్‌రామ్ బస్తీతో పాటు నియోజకవర్గంలోని అన్ని బస్తీలు, మురికివాడల సమస్యలను వేగవంతంగా పరిష్కరిస్తామన్నారు. జీహెచ్‌ఎంసీ, వాటర్‌బోర్డు, విద్యుత్, ఇతర శాఖల అధికారులు బస్తీలు, మురికివాడల్లో పర్యటించి ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కారం చేస్తానన్నారు. అనంతరం ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని బస్తీలలో ప్రతిరోజు పర్యటించి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందకుమార్, డి.శ్రీశైలం, శ్యామ్, ఇ.నర్సింగ్, జె.శ్రీకాంత్, రాము తదితరులు పాల్గొన్నారు.



మంత్రి తలసానిని కలిసిన ఆనంద్‌కుమార్‌గౌడ్

రమణీయం ఆది శంకరాచార్య స్తోత్రాలు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీవాణీ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న శంకరాచార్య స్తోత్ర గానమంజరి బషీర్‌బాగ్‌లోని కనకదుర్గ నాగలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఘనంగా ప్రారంభమైంది. రెండో రోజు శనివారం సంస్థ వ్యవస్థాపకుడు యరగొల్ల శ్రీనివాస్‌యాదవ్ బృందం ఆలపించిన ఆది శంకరాచార్య రచించిన స్తోత్రాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రామరాజు, తబళ గుణశేఖరం, హన్మంతరాయ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి బలవన్మరణం

చిట్యాల: కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలో చోటు చేసుకుంది. హైదరాబాద్‌లోని గోల్కొండ ప్రాంతానికి చెందిన నల్లె అజయ్‌కుమార్(26) సినిమా రంగంలో దర్శకత్వ శాఖలో పనిచేస్తున్నాడు. అజయ్‌కుమార్ ఏడేళ్ల క్రితం సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం లింగాల గ్రామానికి చెందిన రజనీని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇటీవల భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో రజని పుట్టింటికి వెళ్లిపోయింది. అజయ్‌కుమార్ శనివారం భార్య దగ్గరికి వెళ్లి తిరుగు ప్రయాణంలో చిట్యాలకు చేరుకున్నాడు. స్థానిక జాతీయ రహదారి పక్కనున్న ఓ లాడ్జిలో దిగాడు. మధ్యాహ్నం కాసేపు తన స్నేహితులకు వీడియో కాల్ చేసి తాను ఉరి వేసుకుంటున్నట్లు చెప్పాడు. అనంతరం లాడ్జిలోని తన గదిలో బెడ్‌షీట్‌తో ఉరి వేసుకున్నాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

నోరూరించే దమ్ కే రోట్



గోల్కొండ: మొహర్రం నెలలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఎన్నో పిండి వంటలను తయారు చేస్తారు. వీటిలో ప్రధానమైనవి దమ్ కే రోట్. 15 ఏళ్లుగా టోలిచౌకి, మెహిదీపట్నంలలోని పిస్తాహౌస్ వారు దమ్ కే రోట్‌లను ప్రత్యేకంగా తయారు చేస్తారు. ఇవి కేవలం మొహర్రం నెలలో మాత్రమే అందుబాటులో ఉంటాయి. స్వచ్ఛమైన నెయ్యి, డ్రై ఫ్రూట్స్, రవ్వ, పిండితో తయారు చేసే ఈ రోట్లు రుచికరమైనవే కాకుండా ఆరోగ్యానికి ఎంతో మంచివి. గిఫ్ట్ ప్యాకెట్లు, విడిగా కూడా ఇవి అందుబాటులో ఉంచామని పిస్తాహౌస్ ప్రతినిధి తెలిపారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



గౌలిపురా నుంచి లలితాబాగ్ బిడ్జి వైపు వెళ్లే ప్రధాన రహదారిలో..

గౌలిపురా: గౌలిపురా నుంచి లలితాబాగ్ బ్రిడ్జి వైపు వెళ్లే ప్రధాన రహదారిలో డ్రైనేజీ మ్యాన్‌హోల్‌కు పైకప్పు లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఈ దారిలో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షం పడినప్పుడు ఈ మ్యాన్‌హోల్ ద్వారా పెద్ద ఎత్తున వర్షపు ప్రవహిస్తుండటంతో మ్యాన్‌హోల్ కనిపించకుండా పోతుంది. ఆ సమయంలో వాహనదారులు, పాదచారులు ప్రమాదవశాత్తు మ్యాన్‌హోల్‌లో పడే ప్రమాదముందని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్‌పై కప్పును ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానికులు, వ్యాపారులు కోరుతున్నారు.

జియాగూడ కమేళా ఆధునీకరణకు కృషి

జియాగూడ: జియాగూడ కమేళాను సందర్శించి ఆధునీకరణకు కృషి చేస్తానని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం జియాగూడ ఆరె కటిక సంఘం అధ్యక్షుడు నర్సింగ్‌రావు, చర్మకష్ సంఘం అధ్యక్షుడు శశికాంత్‌రావు, ప్రధాన కార్యదర్శి దర్శన్‌కుమార్ తదితరులు కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నాటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి నగరంలోని ఐదు కమేళాలను యాధాస్థానంలో ఆధునీకరిస్తామని హామీ ఇచ్చి నాలుగు కమేళాలు పూర్తి చేశారు. కానీ జియాగూడ కమేళాను నిర్మాణం కాలయాపనగా అయ్యిందన్నారు. జియాగూడ స్లాటర్ హౌస్ నిర్మాణాన్ని ప్రభుత్వ వ్యయంతో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్మించి ఆరె కటిక, దానిపై ఆధారపడి జీవిస్తున్న ఇతర కుటుంబాలను ఆదుకోవాలని ఎంపీ రేవంత్ రెడ్డికి విన్నవించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు సుభాష్, జ్ఞానేశ్వర్, హరికిషన్, కేఎస్ మనోజ్ కుమార్, సత్యం, కేఎస్ ప్రేమ్‌కిశోర్, నరేష్, సాయి, గురుదాస్ పాల్గొన్నారు.



రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆరె కటిక సంఘం ప్రతినిధులు

కోఠి ఈఎన్‌టీ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



శస్త్రచికిత్స నిర్వహించిన వైద్యుల బృందం

సుల్తాన్‌బజార్: తీవ్రమైన శ్వాస ఇబ్బందితో బాధపడుతున్న ఓ చిన్నారికి కోఠి ఈఎన్‌టీ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేశారు. నల్గొండ జిల్లా నిడమనూరు మండలం, ముప్పారం గ్రామానికి చెందిన హేమలత అనే చిన్నారి శ్వాసనాళంలో పులిపిరిలాంటి (పాపిల్లోమా) అనే వ్యాధి రావడంతో ఈఎన్‌టీ ఆస్పత్రికి శస్త్ర చికిత్స నిమిత్తం వచ్చారు. ఈ ప్రాణాంతకరమైన వ్యాధికి డాక్టర్ సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలో చిన్నారికి ఆపరేషన్ చేసి పాపిల్లోమాను తొలగించారు. ఆపరేషన్ తర్వాత పాప ఆరోగ్యం మెరుగుపడడంతో డాక్టర్లు, ఆమె తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ శస్త్ర చికిత్సలో డాక్టర్ రవిశంకర్, డాక్టర్ సత్యకిరణ్, డాక్టర్ ఆశీష్, డాక్టర్ మీనా, అనస్థీషియా వైద్యులు నిఖిల, స్వప్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శస్త్రచికిత్స నిర్వహించిన వైద్యులను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్ అభినందించారు.

శాస్త్రీయ నృత్య కళల పట్ల మక్కువ పెంచాలి



కళాకారులతో జీవీ.అప్పారావు తదితరులు

గన్‌ఫౌండ్రీ: నేటితరం విద్యార్థులకు చిన్నతనం నుంచే శాస్త్రీయ సంగీత నృత్యాలపై మక్కువ కల్పించాలని ఏపీ జెన్‌కో పూర్వ సంచాలకులు జీవీ అప్పారావు అన్నారు. శనివారం రవీంద్రభారతిలో రాధా నృత్యాలయం 21వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురు పరంపరలో భాగంగా రాధా మోహనం నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి సమాజానికి ఇటువంటి శిక్షణాలయాలు అవసరమని, మన కళలకు పునర్వైభవం రావాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రముఖ నృత్యగురువు రాధా మోహన్ శిష్యబృందం చేసిన నృత్యరూపకం ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ పూర్వ సంచాలకులు వేణుగోపాల్, సంస్థ వ్యవస్థాపకులు రాధామోహన్ తదితరులు పాల్గొన్నారు.